3. మిన్ను నుండి సంతోషోదయము - మిగుల ప్రకాశించె - హృదయములఁ - దగులఁ ప్రకాశించె = మున్ను జేయఁబడిన వాగ్దత్తము - తిన్నగ నెరవేరె భక్తుల - కన్ను లాస దీరె ॥సంతో॥

4. ప్రీతియైన నీ పండుగ గూర్చి - నూతన కీర్తనను - గలసికొని - నాతోఁ పాడుచును = నీ తరి దూరస్థుల కీ వార్తను - నే తీరును నైనఁ - దెలుపఁగ - నాతురపడవలెను ॥సంతో॥

5. పాపులపై దేవునికిఁ గలిగిన - ప్రబలమైన దయను - లోకమునఁ - జూపింపఁ గవలెను = జూపకపోయిన లోపము మనపై - మోపఁబడును నిజము - వేగము - జూపుద మా పథము ॥సంతో॥

- బేతాళ జాన్

## 114 జ్ఞానులు క్రీస్తును ఆరాధించుట

రా - శంకరాభరణము తా - ఆది

జ్ఞాను లారాధించిరి - యేసు ప్రభునిఁ - బూని పాపులఁ బ్రోవ మెనిఁ దాల్చిన తరి ॥జ్ఞాను॥

1. చాల కాలము నుండి - మేలు వార్త నాసక్తి - నాలకించి నక్షత్ర - కాల చిహ్నముఁ గూడి = మేలు మేలని - మ - మ్మేలు వాఁడని - మంచి - బోళము సాంబ్రాణి వేసి ॥జ్ఞాను॥

2. దూర మనక యాత్ర - భార మనక బయలు - దేరి సంతోషముతోఁ - జేరి మేలిమి బం = గార మిచ్చిరి - మన - సార మెచ్చిరి జో - హారు జోహారటంచు ॥జ్ఞాను॥

3. ఈ దివసంబున - బేత్లెహేమను నూర - యూదుల రాజుగాఁ - బాదుకొన్నయేసు = నాథ స్వామిని - స - మ్మోద మిమ్మని - య - య్యూదజనుల మధ్య ॥జ్ఞాను॥

4. ఈ సమయము మన - మా సమయంబుగఁ - జేసి స్తుతింపను - జేరితి మిచ్చోట = భాసురంబగు - శ్రీ - యేసు నాధుని - హృద - యాసనంబునఁ జేర్చి ॥జ్ఞాను॥

- బేతాళ జాన్



## 115 బాల యేసుకు గీతాంజలి

రా - భైరవి (చాయ: సందియము వీడవె) తా - త్రిపుట

గీతములు పాడుఁడీ - యేసునికి సం - గీతములు పాడుఁడీ = పాతకుల మగు మనల దారుణ - పాతకము తన విమలరక్త - స్నాతులనుగాఁ జేసి పాపను - భాతకులలో నవతరించెను ॥గీతములు॥

1. రాజులకు రాజుగా - నేలుచు మోక్ష - రాజ్యమున కర్తగా = బూజలందుచు దూత పరిగణ - పూజితుండౌ ఘనుఁడు తన దగు - తేజ మెల్లను విడిచి యీయిలఁ - దేజహీనులలోనఁ బుట్టెను ॥గీతము॥

2. దాసులగు వారలన్ - దమ పటు దోష - త్రాస విముక్తులన్ = జేసి వారల నెల్ల మోక్ష ని - వాసులుగఁ జేయంగ రక్తముఁ - బోసి కృపచేఁగావ వచ్చెను - యేసు నాథుఁడు దీన వృత్తిని ॥గీతములు॥

3. మానవుల కెల్లను - దేవుని ప్రేమ - మానుగాఁ జూపను = ప్రానిపై దన రక్త మొసఁగఁగ - మానవుండై పుట్టె యూదుల - లోన యేసను పేరుచేఁదా - దీనుఁడై యిమ్మానుయేలు ॥గీతములు॥

4. ఆదిఁ దన వాక్యము - నందున యేసు - మోదమున్ నిట్లనెన - మేదినిందా మనుజుఁడై యిఁక - సాదరమ్మునఁ బ్రోవ మనుజుల - నా దయాళుఁడు తనదు దేహము - సాధుగా నర్పింతు ననుచును ॥గీతములు॥

- మురారి దావీదు

## 116 రారాజు జన్మదినము

రా - హిందుస్థాని తోడి తా - ఆది

రారె చూతము - రాజసుతుడీ - రేయి జనన మాయెను = రాజులకు రా - రాజు మెస్సియ - రాజితంబగు తేజమదిగో ॥రారె॥

1. దూత గణములన్ - దేరి చూడరే - దైవ వాక్కులన్ - దెల్పగా = దేవుడే మన - దీనరూపున - ధరణి కరిగెనీ - దినమున ॥రారె॥

2. కల్లగాదిది - కలయు గాదిది - గొల్ల బోయల - దర్శనం = తెల్లగానదె - తేజరిల్లెడి - తారగాంచరె - త్వరగ రారే ॥రారె॥